జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



## పెట్రో ధరలు పెంపుపై..
# భగ్గుమన్న వైసీపీ

- నియోజకవర్గ కేంద్రాల్లో ఆ పార్టీ నేతల బైక్ ర్యాలీ, మానవహారం
- పెట్రో ధరలు తగ్గించాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- వినూత్నంగా నిరసనలు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత
- పెట్రో ధరలు పెంపుతో నిత్యావసరాల ధర పెరిగే అవకాశం
- సామాన్య, మధ్యతరగతి నడ్డివిరిచిన కూటమి ప్రభుత్వం
- ధరలు తగ్గించేవరకూ పోరాడుతాం
- వైసీపీ నేతలు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్, చింతాడ రవి

**శ్రీకాకుళం,మే 18 (వార్త):** పెట్రో ధరలు పెంపును నిరసిస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. సోమవారం శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలతో పాటు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నరసన్నపేటలో మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, టెక్కలిలో పేరాడ తిలక్, ఆమదాలవలసలో చింతాడ రవి ఆధ్వర్యంలో శ్రేణులంతా భారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నరసన్నపేట వైయస్సార్ జంక్షన్ వద్ద వైయస్సార్ విగ్రహానికి కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ పెట్రో ధరలు పెంచబోమని కూటమి నేతలు ఎన్నిల ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాటతప్పారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వల్ల రవాణా ఛార్జీలు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన ర్యాలీలో పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, వైఎస్సార్సీపీ స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ టెక్కలిలో వైసీపీ నాయకులు రోడ్డెక్కి నిరసన కార్యక్రమం చేపట్టారు. వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ఆర్ జంక్షన్‌లో పెద్ద ఎత్తున మానవహారం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పేరాడ తిలక్ మాట్లాడుతూ పెట్రో ధరలు పెంచిన కూటమి ప్రభుత్వాన్ని తక్షణం గద్దె దించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే పెట్రోల్ డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, మిగతా రాష్ట్రాల్లో పెద్దగా ధరలు పెరగలేదన్నారు. ఈ ధరలు పెరుగుదల వల్ల సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.




### సామాన్యుడిపై ధరాభారం

**పలాస:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై పలాసలో వైసీపీ నాయకులు ర్యాలీ, నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వైసీపీ శ్రేణులు సోమవారం భారీ స్థాయిలో రోడ్డెక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించాయి. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నేతృత్వంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. రోడ్డుపై బారులుతీరి మానవహారం నిర్వహిస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వాలే అధికారంలో ఉన్నప్పటికీ.. పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు కేంద్రాన్ని కారణంగా చూపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తప్పించుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనని మండిపడ్డారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పలాస ఆర్డీవో అప్పలరాజుకు వినతిపత్రం సమర్పించారు. వైసీపీ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు ఎన్ని ధనుంజయ, పట్టణ అధ్యక్షులు శిస్టు గోపి, జడ్పి వైస్ చైర్మన్ పాలిన శ్రావణి శ్రీనివాస్ యాదవ్, ఎంపీపీలు డొక్కరి దానయ్య యాదవ్, ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, దువ్వాడ రవి, దల్లి జానకిరెడ్డి, దున్న సత్యం, గుజ్జు జోగారావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం ప్రతినిధులు, యువజన నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.








## సిరుసువాడ రోడ్డుపై.. అధికారుల..
# వాగుడు మాటలు!

- కాంట్రాక్టర్ మాయం
- యం.బుక్‌లోకి రూ.70 లక్షల బిల్లులా?
- ఈ రహదారి పనులు ఆగడానికి కమీషన్ల కక్కుర్తి కారణమా?

**కొత్తూరు, మే 18 (వార్త):** పాలకులు ఇచ్చిన హామీలు, అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ల బాధ్యత ఇవన్నీ కలిసొచ్చి గ్రామీణ అభివృద్ధికి దారి తీస్తాయని ప్రజలు ఆశిస్తారు. కానీ పాతపట్నం నియోజకవర్గం,కొత్తూరు మండలంలోని సిరుసువాడ-కుంటిభద్ర రహదారి పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా మారింది. దశాబ్దాలుగా గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రహదారి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల కొన్ని రోజుల క్రితం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంబంధిత గ్రామ ఎంపీటీసీ ఈ రహదారి పనులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. "రోడ్డు పనులు సగం కూడా పూర్తికాకముందే సుమారు రూ. 70 నుంచి 76 లక్షల బిల్లులు ఎలా యం బుక్ లోకి వెళ్లాయి అంటూ మండల నాయకులను, అధికారులను నిలదీశారు. దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అధికారులు, నాయకులు మాత్రం ప్రశ్నలను దాటవేస్తూ వ్యవహరించారని సమావేశంలో పాల్గొన్నవారు చెబుతున్నారు. ఈ విషయమై సదరు పంచాయతీరాజ్ శాఖ అధికారులకు కొందరు పాత్రికేయలు వివరణ కోరగా, అధికారుల నుంచి సరియైన సమాచారం రాకపోవడ విచారకరం. అయితే సిరుసువాడ గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ఈ రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ప్రస్తుతం కనిపించకుండా పోయాడని, పనులు పూర్తిగా నిలిచిపోయాయని తెలుస్తోంది. కొందరు గ్రామస్తులు అయితే అధికార పార్టీకి చెందిన నాయకులు "కమీషన్ల కక్కుర్తి కారణంగానే పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి" అంటూ బహిరంగ విమర్శలు చేస్తున్నారు. పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. "అభివృద్ధి" పేరుతో కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామని చెప్పే నాయకులు, ఇప్పుడు ప్రజల సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "100 రోజుల్లో పనులు పూర్తి చేస్తాం" అంటూ హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పనులు ఎందుకు ఆగిపోయాయి..? బిల్లులు ఎలా చెల్లించబడ్డాయి..? కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకున్నారా..? అన్న అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణ విచారణ చేపట్టి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





## ప్రమాదాల కూడలి..
# ఆదివారం సంత

- నిత్యం ప్రమాదాలు
- సోమవారం మరో వ్యక్తి దుర్మరణం
- గత ఐదేళ్లలో పదుల సంఖ్యలో ఇక్కడే మృతి
- హైవే అధికారులకు పట్టని ఫ్లైఓవర్ నిర్మాణం

**కంచిలి, మే 18 (వార్త):** కంచిలి మండలం పరిధిలో కంచిలి, జాడుపూడి మధ్య మకరాంపురం జంక్షన్ జాతీయ రహదారిపై నిర్వహించే ఆదివారం సంత కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతూ గాయాల పాలైన వారు లెక్కలేనంత మంది ఉండగా, మృతి చెందిన వారు గత ఐదేళ్లలో పదుల సంఖ్యలో ఉంటారు. తాజాగా సోమవారం కూడా ఇదే కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం పాత శిలగాం గ్రామానికి చెందిన పోతల రామారావు(58) అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీపై సర్వీస్ రోడ్లో ప్రయాణం చేస్తూ జాతీయ రహదారిపై ఎక్కే క్రమంలో వెనుక నుంచి పలాస వైపు అతివేగంగా వెళుతున్న కారు ఢీకొట్టడంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు రామారావుకు భార్య రాజేశ్వరి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారమైన రామారావు మృతితో కుటుంబ పరిస్థితి అయోమయంలో పడింది. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది మృతి చెంది ఆయా కుటుంబాలు అనాథలుగా మారుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం వేకువజాము నుంచి మధ్యాహ్నాం రెండు గంటల వరకు ఇక్కడ సంత జరగడంతో చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చే వందలాదిమందితో ఈ కూడలి రద్దీగా మారుతుంది. ప్రమాదాల నియంత్రణకు కంచిలి పోలీసులు ప్రతి ఆదివారం ఇక్కడ బందోబస్తు నిర్వహించాల్సి రావడం వారికి కూడా చాలా ఇబ్బందికరంగా మారుతుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎంతోకాలంగా ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని జాతీయ రహదారుల అధికారులను కోరుతున్నప్పటికీ వారిలో కనీసం చలనం లేకపోవడం బాధాకరమంటూ ఈ ప్రాంతీయులు వాపోతున్నారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మందసలో యువకుడి ఆకస్మిక మృతి



**మందస, మే 18(వార్త):** మందస పట్టణంలో ఓ యువకుడు ఆకస్మికంగా మరణించాడు. మందస పంచాయతీకి పక్కనే ఉన్న జిల్లుండ గ్రామానికి చెందిన కొర్రాయి షణ్ముఖరావు అనే వ్యక్తి మందస వచ్చాడు. వ్యక్తిగత పనుల కోసం ఆయన మందస వచ్చాడని చెబుతున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు మందస బస్టాండ్ లో తిరుగుతుండగా.. ఆయన మద్యం సేవించినట్టు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. 9గంటల సమయంలో షణ్ముఖరావు రాజావారి కోట ఆవరణలో పడిపోయాడు. దీంతో ఆయన స్పృహ కోల్పోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. మందస 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పటికే షణ్ముఖరావు మరణించినట్టు గుర్తించారు. అప్పటి వరకు కళ్ల ముందే తిరుగాడిన షణ్ముఖరావు మరణించాడన్న సమాచారం స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది. మృతుని కుటుంబీలకు కన్నీరు మున్నీరుగా విలపించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## 'పుల్లా వాసుదేవు' దాతృత్వం



**మందస, మే 18(వార్త):** పుల్లా వాసుదేవు.. ఈ పేరు హరిపురంతో పాటు ఉద్దాన ప్రాంతంలో కూడా తెలియనివారుండరేమో.. హరిపురం సమస్యల సాధనకు ఆయన చేసిన పోరాటం అందరికీ గుర్తుండి పోతుంటుంది. అంతేకాదు.. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకునిగా.. పార్టీలో అత్యంత నమ్మకస్తునిగా ఆయన గుర్తింపు ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. మరో కోణంలో ఆయన సోషల్ వర్కర్ గా మంచి పనులు చేస్తుంటారు.

పలువురికి సాయపడుతుంటారు. లయన్స్ క్లబ్ కోస్టల్ భాగస్వామిగా సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. మందస మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన దాళసరి గ్రామం నుంచి ఓ గిరిజన కుటుంబం వైద్యం కోసం మందస మండలంలోని హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి వచ్చింది. పేద కుటుంబమైన వారికి భోజనానికి ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ కోస్టల్ సభ్యుడు వారణాసి అన్నాజీరావు సహకారంతో ఆ గిరిజన కుటుంబం వైద్యం పూర్తయ్యే వరకు భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. పుల్లా వాసుదేవు ఉదారతను స్థానికులు అభినందిస్తున్నారు.

## నేడు మందసలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**మందస, మే 18(వార్త):** మందసలో ఈ నెల 19న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్యాంప్ జూనియర్ మేనేజర్ తెంబ రామారావు చెప్పారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం సౌజన్యంతో, మందస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నిపుణులు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మందసలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించబడుతుందన్నారు. శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు జరుపబడుతుందని, రోగులు ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు, ఫోన్ నంబర్, రెండు జతల దుస్తులు, ప్లేటు, గ్లాసు తప్పక తీసుకురావాలని సూచించారు. కంటి ఆపరేషన్ అవసరమైన రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా అర్హులకు ఉచితంగా ఆపరేషన్ చేయబడుతుందని రామారావు చెప్పారు.



## మేమున్నామని..!

**- ఆపదలో ఉన్నవారిని ఆదుకున్న జన సైనికులు**

**- నిరుపేద గిరిజన కుటుంబాలకు ఆర్థికసాయం**



**మెళియాపుట్టి, మే 18(వార్త):** మానవ సేవయే మాధవ సేవగా భావించి.. తమకున్న దాంట్లో సాటి వారికి సాయ పడాలనే దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు జన సైనికులు. మెళియాపుట్టి మండలం పరశురాంపురం పంచాయతీ - నందవ తోవూరు గిరిజన గ్రామంలో కొద్దిరోజుల క్రితం జన సైనికుడు సవర దేవరాజు ఇటీవల కూలి పనికి కర్నూలు వెళ్లి అక్కడ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జనసైనికులు ఆ కుటుంబాన్ని సోమవారం పరామర్శించి, తమ బాధ్యతగా ఆ కుటుంబానికి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సవర రామ్మూర్తి ద్వారా రూ.12,500 అందించారు.

- మర్రిపాడు సి పంచాయతీ, సవర మర్రిపాడు గ్రామానికి చెందిన సవర వాసు అనే యువకుడికి నోటి క్యాన్సర్‌తో నాలుకతో పాటు ఇతర భాగంలో ఆపరేషన్ చేసి కొంత భాగాన్ని తొలగించారు. ఆ నిరుపేద కుటుంబానికి తమ రూ.5 వేలను దుక్క బాలరాజు ద్వారా అందించారు.

ఈ కార్యక్రమాల్లో కూరమాన పాపారావు, పెద్దింటి చిన్నబాబు, పత్రీ మణికంఠ, కాకి సోమేశ్వరరావు, లక్ష్మీపురం కిరణ్, ఉమాశంకర్, తిరుపతి, అప్పన్న కాశీ, రాణా జనార్దన్, చింతల ప్రశాంత్, జన సైనికులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు సన్మానం






**పలాస, మే 18 (వార్త):** లేబర్ కాలనీలో ఇంటర్, 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనిపించిన విద్యార్థులను ఘనముగా మత్స్యకార ఐక్యవేదిక, క్యాష్యూ లేబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లేబర్ కాలనీలో విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ , 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో ఈ ఫలితాలను చూసి నిలిచిపోకుండా మరింతగా రాణించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. రానున్న కాలంలో కష్టపడి చదివితే ఇలాంటి విజయాలు మీ ముంగిట నిలుస్తాయని చెప్పారు. గురువులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలంటే కష్టపడి చదవడమే ఉత్తమైన మార్గమని అన్నారు. భావితరానికి మీలాంటి ఉత్తమ విద్యార్థులే దేశానికి శ్రీరామ రక్ష అని మీ వలన మీ తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం పెరుగుతుందని, చక్కగా చదువుకొని అందరికీ మీరు ఆదర్శంగా నిలబడాలన్నారు. ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థిని, విద్యార్థులకు క్యాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్షులు శిష్ట గోపి కార్యదర్శి అంబటి ఆనందరావు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి ఎ.వి .కె శాస్త్రి, సీదిరి త్రినాధ్, కొమర దేవరాజు, ఎల్.వి. చలం, పల్లెటి రాజారావు, బైపల్లి అప్పారావు, అతిథిలుగా విచ్చేశారు. ఇంటర్లఓ కారి చైతన్య -987, బిసాయి అమృత-985, ఆదిత్య. సాహుకి -437, పల్లెటి చరణ్-434 మార్కులు, పదవ తరగతి ఫలితాల్లో పొట్నూరు శ్రీమహ-588, కె.తన్విత-578, బమ్మిడి శ్రీహిత-569, గుంటు దివ్య-538కు సన్మానం చేశారు. కార్యక్రమంలో గజ్జి బాలయ్య, బొంపల్లి సునీల్, లండ రమణ, బమ్మిడి సుధాకర్, నెయ్యిల శివ, లండ పాపారావు, బొంపల్లి గణేష్, కుంది అప్పన్న, వాసుపల్లి బాలరాజు, పెరిమళ్ళ ప్రకాష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రో ధరల పెంపు దారుణం

**మాట తప్పిన కేంద్ర సర్కార్**

**-ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో ఇంధన ధరలు ఎక్కువే**

**-ప్రజలపై పెట్రోల్ భారం తగ్గించాలి**

**-వైసీపీ సీనియర్ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు**



**పలాస, మే 18(వార్త):** సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, వాహనదారులకు పెను భారంగా మారిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని పలాస మాజీ మున్సిపల్ చైర్మన్, వైసీపీ సీనియర్ నేత బల్ల గిరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం పలాసలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు."ఎన్నికల ముందు మాటిచ్చి.. తర్వాత పెంచారు". కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని బల్ల గిరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "ఇటీవల నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం' అని పదేపదే ప్రకటించింది. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపుతున్నారని, గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని, ఇప్పుడు అది పరాకాష్టకు చేరిందని ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి ఇంధన ధరలు పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే. భారత్ తన అవసరాల్లో దాదాపు 80 శాతం ముడి చమురును విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ప్రపంచ మార్కెట్లో ఒక డాలర్ పెరిగినా మన ఖజానాపై వేల కోట్ల భారం పడుతుంది". ఏపీలో సెస్, వ్యాట్ భారం ఎక్కువని, ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా చంద్రబాబు ప్రభుత్వం 4 శాతం స్పెషల్ వ్యాట్, 1 శాతం రోడ్డు సెస్ విధించిందని గిరిబాబు విమర్శించారు. ఈ పన్నులను తగ్గిస్తే కొంతమేర పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయనీ, ప్రజలపై అదనంగా కోట్ల రూపాయల భారం మోపుతున్నారని తెలిపారు. సీబీఎన్ ట్యాక్స్‌ల ద్వారా ఏడాదికి రూ. 3000 కోట్లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం ప్రజలు తినే తిండి, కట్టుకునే బట్టతో సహా ప్రతి మనిషి దైనందిన జీవితంపై పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ..
## తక్షణమే ఉపసంహరించుకోవాలి

**- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్**

**పలాస, మే 18(వార్త):** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ యం యల్ లిబరేషన్, సిపిఎం పార్టీలు డిమాండ్ చేసాయి. సోమవారం లిబరేషన్ పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యా పార్టీల నాయకులు టి సన్యాసిరావు, యన్ గణపతి, ఐఫ్వా రాష్ట్ర అధ్యక్షులు తామాడ అరుణ తదితరులు మాట్లాడుతూ ప్రజలుపై భారాలు మోపే పెట్రోల్ డీజిల్ ధరలు ఉపసంహారించడం ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చిన వెంటనే మరింత భరితెగించి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని దుయ్యబట్టారు. ఇప్పటికే నెల క్రిందట వినియోగదారులుపై 50/? లు గ్యాస్ ధరలు పెంచి భారం మోపారని, కమర్శియల్ సిలిండర్ ధర పెంచి మరికొంత భారం వేశారని, నిత్యఅవసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలు మోయలేకుండా ఉన్నారని అన్నారు. కార్పొరేట్లకు దేశంలోని ఖనిజ సంపద, భూమి, అడవులు దొచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం, ప్రజలపై మాత్రం భారాలు వేయడానికి వెనకాడడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలకు ధరల భారాలు నుంచి కాపాడాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.




### శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో
## భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ



**జలుమూరు, మే 18(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానం క్షేత్రంలో ఎండ తీవ్రత దృష్ట్యా సోమవారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని సోషల్ వర్కర్, రిటైర్డ్ సీఐ రామ సూర్యరావు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా మజ్జిగ అందజేశారు. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రామ సూర్యరావును దేవస్థానం ఈవో ఏడుకొండలు, అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాయుడుగారి రాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్ గుంట కర్ణ వీరుడు, ఇంజనీర్ సింహాచలం, గ్రామ పెద్దలు, అర్చకులు అభినందించారు. భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందని, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలి

**ఇచ్ఛాపురం, మే 18 (వార్త):** ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రి ఆసుపత్రిని డాక్టర్ కల్యాణ బాబు( స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆఫీసర్ ) పరిశీలించారు. హాస్పిటల్లో ఉన్నటువంటి గర్భిణీ స్త్రీల వార్డు వసతి సేవలు చిన్నపిల్లల వార్డు వసతి సేవలు ఎన్ సి డి విభాగం డయాలసిస్ యూనిట్ మొదలగు అన్ని విభాగాలు సందర్శించి తగు సూచనలు సలహాలు అందించారు. అలాగే ఐసిటిసి సెంటర్ జనరల్ ల్యాబ్ హాస్పిటల్ డ్రైనేజ్ సిస్టం బాత్రూమ్స్ ప్రతిదీ పరిశీలన చేసి రిపోర్టు తయారు చేశారు. స్టేట్ ఆఫీసర్ కల్యాణ్ బాబు తో హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ టి దేవేందర్ రెడ్డి , డాక్టర్ శ్వేతా పండా , డాక్టర్ బమ్మిడి గౌతమి ప్రసూతి వైద్య నిపుణులు , డాక్టర్ టి శిల్ప చిన్నపిల్లల వైద్యనిపుణులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ మిగతా వైద్య బృందం శానిటరీ విభాగం సిబ్బంది అన్ని విభాగాలు పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి

**-యుద్ధం భారం ప్రజలపై మోపవద్దు**

**-వామపక్ష పార్టీల నాయకుల డిమాండ్**



**మందస, మే 18(వార్త):** కేంద్రం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని, యుద్ధం భారం ప్రజలపై మోపవద్దని వామపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మందస తహసీల్దార్ కార్యాలయం వద్ద వామ పక్షాలు పార్టీల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మద్దిల రామారావు, జనశక్తి నాయకుడు కోనేరు గురయ్య, గిరిజన సంఘం నాయకుడు నరసింహులు, ఐప్వా నాయకులు కోనారి ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఈ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన తీరులో భాగంగా దేశం మొత్తం ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిందన్నారు. నిన్నటి వరకు మన దేశంలో పుష్కలంగా క్రూడ్ ఆయిల్, నిత్యవసర వస్తువులు 40 సంవత్సరాల వరకు మనకు సరిపడిన వస్తువులు, పుష్కలంగా ఉన్నాయని కేంద్రం చెప్పిందన్నారు. వస్తువులన్ని ముందు జాగ్రత్తగా ఉంచామని చెప్పి, యుద్ధంతో మనకు సంబంధం లేదని చెప్పిన భారత ప్రధాని నరేంద్రమోడీ 5రాష్ట్రాల ఎలక్షన్ల వరకు నోరు మెదపని నాయకులు ఎలక్షన్ల తరువాత జాగ్రత్తలు పడండని నీతులు బోధిస్తున్నారన్నారు. నరేంద్రమోడీ ఎలక్షన్లు పూర్తయిన వెంటనే రేట్లు పెంచారని.. గ్యాస్, పెట్రోల్, డీజిల్ రేట్లు మూడున్నర రూపాయలు చొప్పున పెంచారన్నారు. దీనికి అనుసంధానంగా నిత్యవసర వస్తువులు అన్ని రేట్లు పెరిగాయన్నారు. సామాన్యుల పైన, బలహీన బడుగు వర్గాల ప్రజలపైన ఆర్థిక భారాలు పడి ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. అక్కడ నరేంద్రమోడీ, చంద్రబాబు ప్రసుతం నీతులు బోధిస్తూ ఉన్నారన్నారు. దేశంలో బంగారం కొనొద్దు, వాహనాలు వాడకం తగ్గించండి.. మేము సైతం ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి కాన్వాయిలు తగ్గించుకున్నాం.. మీరు కూడా నడిచి వెళ్లండని చెబుతున్నారన్నారు. ఆయిల్ వాడకాలు తగ్గించండని, కొత్త నినాదాలు చేపడుతున్నారన్నారు. యుద్ధం సమయంలో నోరు మెదపకుండా ఎవరికి చెడ్డ కాకుండా వ్యవహరించిన తీరుపై నాయకులు హెచ్చరించారు. భవిష్యత్ లో మీరు బోజనం ఒక్క పూటే తినండని చెప్పినా, ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. అటువంటి గత్యంతరం లేని పరిస్థితులలో ఈ దేశంలో మనం జీవిస్తున్నామన్నారు. మనం జీవించే హక్కుకై పోరాడాలని, పెంచిన పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యవసర వస్తువులు ధరలును వెంటనే తగ్గించాలని డిమాండ్ చేసారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజామికవాదులు పాల్గొన్నారు.



# ఆదుకున్న 'ముగ్గురు మిత్రులు'

**-రక్తదానం చేసిన యువకులు**

**-లొహరిబందకు మంచిపేరు**

**మందస, మే 18(వార్త):** లొహరిబంద మంచి ఆదర్శ గ్రామం. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకుంటారు. గ్రామంలో సమస్యలున్నా.. ఎవరికైనా ఆపద వస్తే తక్షణమే స్పందిస్తారు. ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు మిత్రులు ఒకేసారి రక్తదానం చేసి.. గ్రామం పేరు మరోసారి గుర్తుకు తీసుకువచ్చేలా చేశారు. లొహరిబంద పందిరి లక్ష్మి సుమారు 10సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. హటాత్తుగా హిమోగ్లోబిన్ 4.7తగ్గడంతో ఎ పాజిటివ్ బ్లడ్ కావాలని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. సమాచారం తెలిసిన వెంటనే మేము ఉన్నాం అంటూ లొహరిబంద గ్రామానికి చెందిన అందాల సురేష్, జుత్తు హేమరాజు, అందాల అనిల్ ముందుకు వచ్చారు.

ఈ ముగ్గురు మూడు యూనిట్లు బ్లడ్ ఇచ్చి, మనసు ఉన్న మహారాజులుగా అందరి మన్ననలు పొందారు. ఒక్క ప్రాణం కాపాడటంలోనే మనిషి విలువ అందరికీ తెలుస్తాయని, గ్రామ ప్రజల్లో చైతన్యం అంచెలంచెలుగా ఎదుగుతోందని స్థానికులు పేర్కొన్నారు. ఒకప్పుడు రక్తదానంటే భయపడే వారని, మనకి ఏమి అయిపోతుందోనని భయపడేవారు. నేడు మార్పు మొదలైందని, రక్తదాతలు మానవత్వం అభినందనీయమని గొరకల పాపారావు అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు



**నరసన్నపేట, మే 18(వార్త):** నరసన్నపేటలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని 24 ప్రభుత్వ పాఠశాలలకు శుద్ధి చేసిన తాగునీరు అందించే లక్ష్యంతో ఆర్వో ప్లాంట్లను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఇటీవల కొన్ని ప్లాంట్లు సాంకేతిక లోపాలతో పనిచేయకపోవడంతో వాటికి మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. సోమవారం నుంచి దశలవారీగా మరమ్మతు పనులు ప్రారంభించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలల ఉపాధ్యాయులు ఈ పనుల్లో సహకరించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రతి పాఠశాలలో తాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడం అవసరమని అధికారులు పేర్కొన్నారు.

# నరసన్నపేట వీధుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు

**- చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి**



**నరసన్నపేట, మే 18(వార్త):** నరసన్నపేట పట్టణంలోని పలు వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు తక్షణమే దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన అనంతరం ఆదివారం, సోమవారం రోజుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టలేదని చెబుతున్నారు. దీంతో పలు వీధుల్లో చెత్త పేరుకుపోయి అసౌకర్యం కలుగుతోందని పేర్కొంటున్నారు. చెత్త సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు, ఈగలు పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# మామిడిపల్లి సంబరాలు ఘనంగా జరగాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ అశోక్**



**సోంపేట, మే 18(వార్త):** మామిడిపల్లి గ్రామ దేవత ఉత్సవాలు ఎవరు మరిచిపోకుండా అందరి మదిలో ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉండాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెంధాళం అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో ప్రారంభమైన అమ్మవారి సంబరం మహోత్సవాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఐక్యతకు మారుపేరైన మామిడిపల్లిలో ఇటువంటి ఉత్సవాలు నిర్వహించడం చాలా ఆనందకరమని అన్నారు. ప్రణాళిక బద్ధంగా మంచి ఆలోచనతో ఐకమత్యానికి ప్రాధాన్యం ఇచ్చి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి కలసికట్టుగా కృషి చేయడం గొప్ప విషయమని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఉత్సవాలకు విచ్చేసిన గ్రామస్తులకు గ్రామ కమిటీకి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు



**నరసన్నపేట, మే 18(వార్త):** వేసవి సెలవుల్లో విద్యార్థుల అభ్యాసం కొనసాగేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయురాలు పద్మజ తెలిపారు. సోమవారం ఉదయం నరసన్నపేట మండలం రావులవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన విద్యార్థులతో ప్రత్యేక తరగతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. సెలవు రోజులను విద్యార్థులు వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు హోంవర్క్‌లపై కూడా మార్గదర్శనం చేస్తున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడకుండా ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి అభ్యాసం కొనసాగించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకుని సహకరించాలని ఉపాధ్యాయురాలు కోరారు.

# ఇచ్ఛాపురం రామానాయుడు జయదేవ్

**-పొదుపు మంత్రంలో భాగంగా**

**సైకిల్‌పై పర్యటన**

**ఇచ్ఛాపురం, మే 18(వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు పొదుపు చర్యలు పాటించాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయ దేవ్ యాదవ్ ముందు వరుసలో ఉన్నారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు స్ఫూర్తితో సైకిల్ పై పర్యటన చేపట్టారు. 20 వ వార్డు కొండ పొలమ్మ కాలనీలో ప్రజా సమస్యల పరిశీలన చేశారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిస్తున్న ఇంధన పొదుపు పర్యావరణ పరిరక్షణ సందేశానికి ప్రేరణగా యువ నాయకుడు కాళ్ల జైదేవ్ తన ఇంటి నుండి సైకిల్‌పై ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని కేపీ కాలనీకి వెళ్లి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో మహిళలు , స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే నిజమైన ప్రజాసేవ అని జైదేవ్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జైదేవ్ మాట్లాడుతూ సైకిల్ వినియోగం వల్ల ఇంధనం ఆదా అవుతుందని, కాలుష్యం తగ్గుతుందని. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుకు ప్రేరణగా సైకిల్‌పై ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకున్నానని అన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందించారు.





# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచాలి

**సారవకోట, మే 18(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ ఎంవి రమణ సూచించారు. సోమవారం పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాఠశాలల్లో కొత్తగా విద్యార్థులను చేర్పించే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లల్లో ఇప్పటికీ 55 శాతం మంది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు తన పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచాలని కోరారు. విద్యార్థుల చేరికలు పెరగడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని ఎంఈఓ పేర్కొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పీర్ల కొండ ఆవరణలో స్థలాలపై నిషేధం



**ఇచ్ఛాపురం, మే 18(వార్త):** రత్తకన్న గ్రామం నకు సంబంధించిన సర్వే నెంబర్ 197 ,పీర్ల కొండ పరిసరాల్లో స్థలాలు పై నిషేధం ఉన్నట్లు తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొండ పోరంబోకు స్థలంలో కొంత మంది ఆక్రమణదారులు దొంగ పట్టా లు సృష్టించి ప్రజలను మోసగించ ప్రయత్నం చేస్తున్నారని తెలిసిందని , సర్వే నెంబర్ 197 పూర్తిగా ప్రభుత్వ భూమిఅని దీనిపై కొనుగోలు, అమ్మకాలు నిషిద్ధం అని అన్నారు. దురాక్రమణ లకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ నిరసన ర్యాలీ



**నరసన్నపేట, మే 18(వార్త):** నరసన్నపేటలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఇంధన ధరల భారం సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతుండటంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా అధికమవుతున్నాయని పేర్కొన్నారు. పెరిగిన ఇంధన ధరలు సామాన్యుడికి గుదిబండగా మారాయని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలపై అదనపు భారం మోపకుండా ఉపశమన చర్యలు ప్రకటించాలని కోరారు. అనంతరం వైసీపీ నాయకులు వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## సారవకోటలో కాలువల పూడిక తీత



**సారవకోట, మే 18(వార్త):** సారవకోట గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని కూరకుల వీధి, వైశ్య వీధుల్లో ఉన్న మురుగు నీటి కాలువల్లో భారీగా పూడికలు పేరుకుపోవడంతో పంచాయతీ సిబ్బంది పూడికతీత పనులు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు రోడ్లపైకి ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో సమస్యను గుర్తించిన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కాలువలను శుభ్రపరచడంతో మురుగు నీటి ప్రవాహం సక్రమంగా సాగుతోందని స్థానికులు తెలిపారు. గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి పనులను తరచూ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## రచయితకి సన్మానం



**ఇచ్ఛాపురం, మే 18 (వార్త):**కేంద్ర రక్షణ రంగం ఫైనాన్స్ విభాగంలో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ గా పని చేసి పదవి విరమణ పొందిన లింగం చిరంజీవి ని సన్మానించారు. స్థానిక గాంధీ పార్కు లో షటిల్ టీమ్ సన్మానించారు.రచయిత గా మారిన చిరంజీవి రావు స్వంతంగా రెండు బుక్స్ రాసి ప్రజలకు అంకితం చేశారు.ఈ కార్యక్రమంలో పిలక సంతు,ఆసి తులసయ్య రెడ్డి కాళ్ళ దిలీప్ కుండల రాజేష్, కిరణ్,జనార్ధన, ఢిల్లీ, రమేష్,శంకర్,వెంకట్రావు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.లరి

## దళిత క్రైస్తవులకు సమాన హక్కులు కల్పించాలి

### - వీహెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ

**పలాస, మే 18 (వార్త):** దళిత క్రైస్తవులకు సమాన హక్కులు కల్పించే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వి హెచ్ పి ఎస్ జాతీయ ఉపాధ్యక్షులు తొత్తరమూడీ శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం పలాసలో ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవుల ఎస్సీ హక్కుల అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమాజంలో గతంలో ఎదురైన వివక్ష, అంటరానితనం కారణంగా అనేక మంది క్రైస్తవ మతాన్ని స్వీకరించాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. విద్య, సామాజిక అవకాశాల కోసం క్రిస్టియన్ మిషనరీల సహాయం పొందిన పరిస్థితులను కూడా ఆయన గుర్తు చేశారు. 1950లో రూపొందించిన చట్టాల అమలుపై పునర్విమర్శ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జ్, వీహెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు తొత్తరమూడి శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లోపింటి తేజ, ఎమ్మార్పీఎస్ యూత్ అధ్యక్షుడు దుర్యోధన, సీనియర్ నాయకులు ఉర్లాన అప్పలరాజు, మీల జోగారావు, బొబ్బిలి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



# మెడికవర్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్స

- డౌన్ సిండ్రోమ్ బాలికకు ఎఎస్‌డీ క్లోజర్స్ చికిత్స
- 30 నిమిషాల్లో పూర్తయిన శస్త్రచికిత్స... విజయవంతం...
- మరో ముగ్గురికి ఎఎస్‌డీ క్లోజర్స్ ఏర్పాటు
- సీనియర్ ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్ట్ లు బుడుమూరు అన్నాజీరావు, ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్ట్ మల్లా ఫణీంద్ర



**శ్రీకాకుళం, మే 18 (వార్త):** శ్రీకాకుళంలోని మెడికవర్ ఆసుపత్రిలో సోమవారం అరుదైన గుండె శస్త్రచికిత్సను నిర్వహించామని సీనియర్ ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బుడుమూరు అన్నాజీరావు, ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మల్లా ఫణీంద్ర తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం మెడికవర్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుండెలోని ఎట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ అనే రంధ్రంను మూసివేసేందుకు చేసే ఒక వైద్య చికిత్స లేదా ఆ పరికరాన్ని సూచిస్తుంది. సాధారణంగా ఎఎస్‌డీ అనేది పుట్టుకతో గుండెలోని ఎడమ, కుడి ఎగువ గదుల మధ్య ఉండే గోడకు ఉండే రంధ్రం అని తెలిపారు. దీనివల్ల రక్తం తప్పు మార్గంలో ప్రవహించి, గుండెపై, ఊపిరితిత్తులపై భారం పడుతుందని వివరించారు. ఎఎస్‌డీ క్లోజర్స్ అనేది అత్యంత ప్రాచుర్యం పొందిన, సురక్షితమైన పద్ధతి అని చెప్పారు. అయితే డౌన్ సిండ్రోమ్ ఉన్న బాలికలో ఇటువంటి రిస్క్ పద్ధతి పాటించడం చాలా అరుదు అని చెప్పారు. అయినప్పటికీ తాము ఎంతో రిస్క్ చేసి బాలికకు ఎఎస్‌డీ క్లోజర్స్ చికిత్స అందించి విజయవంతం చేశామని తెలిపారు. ఈ చికిత్సలో విశాఖపట్నం మెడికవర్‌కు చెందిన పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ రాజు ఎంతగానో సహకరించారని తెలిపారు. ఆమదాలవలస మండలం మెట్టక్కివలసకు చెందిన జి. వైష్ణవి (7) పుట్టుకతో ఎఎస్‌డీ క్లోజర్స్ బాధపడుతోందన్నారు. దీని వల్ల పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉండదన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన నర్సింహులు, రమణమ్మలు వైష్ణవిని రాష్ట్రంలో, దేశంలో అనేక ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తీసుకెళ్లినప్పటికీ డౌన్ సిండ్రోమ్ ఉన్న బాలికకు ఈ చికిత్స అందించేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. అయితే చివరకు వారు మెడికవర్ వైద్యులు డాక్టర్ బుడుమూరు అన్నాజీరావును సంప్రదించగా ఆయన ఆధ్వర్యంలో ముగ్గురు వైద్యబృందం 30 నిమిషాల వ్యవధిలోనే ఎఎస్‌డీ క్లోజర్స్ నిర్వహించి డివైజ్‌ను ఏర్పాటు చేసి విజయవంతం చేసినట్టు వెల్లడించారు. ఇందులో గుండెను కోయకుండానే, తొడలోని రక్తనాళం ద్వారా ఒక సన్నని గొట్టాన్ని గుండెలోకి పంపుతారని తెలిపారు. ఆ రంధ్రం వద్దకు 'అంబ్రెల్లా' ఆకారంలో ఉండే చిన్న మెష్ పరికరాన్ని అమర్చి రంధ్రం శాశ్వతంగా మూసివేస్తారని వివరించారు. రంధ్రం చాలా పెద్దదిగా ఉన్నప్పుడు లేదా ఇతర సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్లు ఓపెన్ హార్ట్ సర్జరీ లేదా మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ద్వారా కుట్లు వేసి లేదా ప్యాచ్ వేసి రంధ్రం మూసివేస్తారని వెల్లడించారు. అయితే ఎటువంటి కోత లేకుండా ఎఎస్‌డీ క్లోజర్స్ చికిత్స నిర్వహించి విజయవంతం చేయడంపై బాధితుల తల్లిదండ్రులు, ఆసుపత్రి వర్గాలు, వైద్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైష్ణవితో పాటు సంతబొమ్మాళి మండలం కాకరాపల్లికి చెందిన మణికంఠ (19) ఇటీవల ఎయిర్ ఫోర్స్ ఎంపికలకు వెళ్లగా అక్కడి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి గుండెలో రంధ్రం ఉన్నట్టు గుర్తించారన్నారు. మణికంఠ , మూడు నెలల బాలింత కంచిలి మండలం కొండపోలేరుకు చెందిన కె తారకు కూడా ఇదే తరహాలో వైద్యచికిత్స నిర్వహించి ఎఎస్‌డీలను క్లోజర్స్ చేసినట్టు వివరించారు. పూర్తిగా ఆరోగ్యశ్రీ ద్వారానే ఈ వైద్యసేవలు అందజేసినట్టు సీనియర్ ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బుడుమూరు అన్నాజీరావు తెలిపారు. ఈ సమావేశంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులు, మెడికవర్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరలోనే నిధుల విడుదల

### -ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, మే 18 (వార్త):** పలాస నియోజకవర్గ పరిధిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వారి వాటా మొత్తాన్ని త్వరలోనే అందిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ "గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వడం కంటే రంగులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చిందని, పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే ఆలోచన వారికి లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి, లబ్ధిదారులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దని, మీ అమౌంట్ త్వరలోనే మీ చేతికి అందుతుంది" అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని, బకాయిలు క్లియర్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పేదల సంక్షేమమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## నేనేమీ చేశాను నేరం?

### -బూత్‌లో 10 ఓట్లు మెజారిటీ రాని వారికి అందలమా?

### -వైస్సార్సీపీ మాజీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి



**ఇచ్ఛాపురం, మే 18 (వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐదేళ్లుగా అంకితభావంతో పని చేశానని, అటువంటి తనను అకారణంగా పార్టీ పదవి నుంచి తొలగించడం అన్యాయమని వైస్సార్సీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. తాను చేసిన సేవలు పార్టీలో ప్రతి ఒక్కరికి తెలుసునని, గతంలో జరిగిన స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికల్లో గాని ఎన్నడూ కూడా రానటువంటి మెజారిటీని తన తేలుకుంచి బూత్‌లో తాను తీసు కొచ్చానన్నారు. ఈ విషయాన్ని పరిశీలిస్తే తన పనితీరు, పార్టీ పట్ల తనకున్న అంకిత భావాన్ని తెలియజేస్తాయన్నారు. పార్టీ ఇచ్చినటువంటి అన్ని బాధ్యతలను సక్రమంగా ఇప్పటి వరకు నిర్వహించి పార్టీకి సంబంధించిన మండల కమిటీలు, అనుబంధ విభాగాలు సకాలంలో గడువుకు ముందే పూర్తి చేసి పార్టీ నాయకులకు అందించానన్నారు. ఎంతోమంది తనకంటే అనుభవం ఉన్న వ్యక్తులను పరిశీలనలోకి తీసుకోకుండా, ఏకపక్షంగా ఎవరితో చర్చించకుండా తీసుకోవడం దారుణమన్నారు. కనీసం గతంలో చేసినటువంటి సీనియర్లు, నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు వహించినటువంటి ఒక ఎమ్మెల్సీ ని గాని ఒక జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ను గానీ ఎవర్ని సంప్రదించకుండా వేరే వాళ్ళని మండల పార్టీ అధ్యక్షుడుగా చేయటం చాలా బాధాకమన్నారు. ఈరోజు పార్టీలో ఉన్నతమైనటువంటి పదవులు అనుభవిస్తున్నటువంటి వ్యక్తులు గడిచిన పది సంవత్సరాల్లో ఒక రోజు కూడా పార్టీకి ఏ రకంగా కూడా పార్టీ ఇన్చార్జిలకు సహకరించటం కానీ వారి బూత్‌లలో 10 ఓట్లు అయినా మెజారిటీ తీసుకురావడం కాని, పార్టీ నాయకుల ఎదుగుదలకు అడ్డుకునే విధంగా, వారికి హాని కలిగించే విధంగా క్షుద్ర పూజలు నిర్వహించటం కానీ వారిపైన మర్డర్ కంప్లైంట్లు పెట్టడం గాని చూస్తే ఇటువంటి వ్యక్తులందరూ పార్టీలో ఉన్నత స్థానాలు అనుభవించటం, నాలాంటి నిబద్ధతతో పనిచేసిన నాయకులను పక్కకి నెట్టటం ఇది పార్టీ ఎదుగుదలకు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఏది ఏమైనప్పటికీ వచ్చేటువంటి సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా చేయటమే నా అంతిమ ధ్యేయం, ఆయన తీసు కున్న ఏ నిర్ణయాన్ని అయినా గౌరవిస్తూ ఒక కార్యకర్తగా పూర్తిస్థాయిలో పార్టీ కోసం పని చేస్తానన్నారు.

## చిరంజీవిరావుకి ఎమ్మెల్యే అశోక్ అభినందనలు



**ఇచ్ఛాపురం, మే 18 (వార్త):** కవిటి రామయ్య పుట్టగా ప్రభుత్వ విప్ క్యాంప్ ఆఫీస్ లో సామాజిక సేవకుడు లింగం చిరంజీవిరావును ఎమ్మెల్యే బెందాలం అశోక్ అభినందించారు. జలియన వాలి బాగ్, బ్లెస్ ఫుల్ లైఫ్ అనే రెండు పుస్తకాలు రచించిన చిరంజీవిని సన్మానించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న రాష్ట్ర బి సి రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, కవిటి ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెగిడి వీధిలో కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు

**పలాస, మే 18 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు సెగిడి వీధిలో కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో నీరు, చెత్త నిల్వ ఉండి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను ఆ వార్డుకు చెందిన సీనియర్ నాయకులు ఎమ్మెల్యే శిరీష దృష్టికి తీసుకెళ్లగా, ఆమె ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడిన కామేశ్వరరావు యాదవ్, బమ్మిడి యర్రప్ప గారి ఇంటి నుండి కొత్తగా రైల్వే ట్రాక్ సమీపంలో నిర్మిస్తున్న డ్రైన్ వరకు నూతన కాలువ నిర్మాణం చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఇదే సమస్యపై పలుమార్లు హామీలు ఇచ్చి, కాలువ నిర్మాణానికి శంకుస్థాపన పేరుతో కొబ్బరికాయలు కొట్టారని, కానీ పనులు మాత్రం ముందుకు సాగలేదని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సమస్య కొనసాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీనిపై మున్సిపల్ సిబ్బంది సానుకూలంగా స్పందిస్తూ, ఆ ప్రాంతంలో కొత్త కాలువ నిర్మాణం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కాశీబుగ్గ క్లస్టర్ కన్వీనర్, పలాస ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సవర రాంబాబు, కాశీబుగ్గ యూనిట్ కన్వీనర్ బాడాడ ఉమాకాంత్, మురపాల నాగరాజు, జనార్ధన, బమ్మిడి రవితేజ, పార్టీ కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546